

రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు

నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 14 జూన్ 2024 | HYDERABAD



రవీంద్రభారతిలో గురువారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పీఆర్‌కే నాట్య ప్రపంచం ఆధ్వర్యంలో జరిగిన పేరిణి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. అంతకుముందు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. -రవీంద్రభారతి, జూన్ 13

## పార పట్టి.. గుంతలు పూడ్చి

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): అసలే వర్షాకాలం.. చిన్నపాటి వానకే రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. దీనికి తోడు రోడ్లపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వాన నీటిలో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు ఎంతకూ స్పందించక పోవడంతో ట్రాఫిక్ పోలీసులే రంగంలోకి దిగారు. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని జీహెచ్ఎంసీ సిబ్బంది కోసం ఎదురు చూడకుండా మియాపూర్ ట్రాఫిక్ పోలీసులే స్వయంగా రంగంలోకి దిగారు. గంపా, పార చేతబట్టి రోడ్లపై ఉన్న గుంతలను సిమెంట్, కంకరతో పూడ్చివేశారు. మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుమన్ ఆధ్వర్యంలో సిబ్బంది బాచుపల్లి ఠాణా దగ్గర నుంచి మియాపూర్ వరకు రోడ్లపై ఉన్న దాదాపు 30 నుంచి 40 గుంతలను పూడ్చారు. ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న చొరవను ప్రజలు, వాహనదారులు ప్రశంసించారు.



## పదేండ్లు..34 సార్లు

### రక్తదానంలో ఆదర్శంగా నిలుస్తున్న నరేశ్

సిటీబ్యూరో, జూన్ 13(నమస్తే తెలంగాణ) : పదేండ్ల కాలంలో.. 34 సార్లు రక్తదానం చేసి... ఎందరో ప్రాణాలు నిలిపాడు కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన నరేశ్. బీ నెగిటివ్ బ్లడ్ కావాల్సిన వారికి అందుబాటులో ఉంటూ.. అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తూ.. తన వంతు సమాజ సేవ చేస్తున్నాడు. అదే విధంగా ప్రత్యేక రోజుల్లోనూ రక్త దాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. వరల్డ్ డోనర్స్ డే సందర్భంగా రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ రక్తాన్ని అందించడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నాడు. తనలాగే సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చేవారు 9652943769కు నంబర్ ద్వారా సంప్రదించాలని సూచిస్తున్నాడు.




గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. తమకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ నినదించారు.

# స్మార్ట్ పార్కింగ్

## 'కేబీఆర్' వద్ద మల్టీలెవల్ కారు పార్కింగ్

రూ.3 కోట్లతో టెండర్లు..
పీపీపీ విధానంలో నిర్మాణం
కీలక కారిడార్‌లో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో అత్యంత రద్దీగా ఉండే కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. వీఐపీ కారిడార్‌లో వాహనదారుల తాకిడితో పాటు పార్కుకు వచ్చే వాకర్ల వాహనాలతో కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ సమస్య జఠిలంగా ఉంటున్నది. దీంతో పార్కింగ్ సమస్యకు చెక్ పెడుతూ.. కీలక నిర్ణయం తీసుకున్నారు. కేబీఆర్ పార్కు గేట్-1 వద్ద కడక్ చాయ్ సమీపంలో స్మార్ట్ మల్టీలెవల్ (మెకనైజ్డ్) కార్, మోటారు సైకిల్ పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో ఆసక్తి గల ఏజెన్సీల నుంచి దరఖాస్తుల స్వీకరణకు టెండర్లు ఆహ్వానించారు. డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేషన్, ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) మోడ్‌లో పైలెట్ ప్రాజెక్టుగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) విధానంలో ఏర్పాటు చేయనున్నారు. 405 చదరపు మీటర్లలో మల్టీలెవల్ కారు పార్కింగ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 72 కారు స్పేస్‌లకు పార్కింగ్ స్థలాన్ని కలిగి ఉంటుంది. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేసే విధంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ మల్టీలెవల్ కారు, మోటారు సైకిల్ పార్కింగ్ సదుపాయంలో సీసీ టీవీ, ఇతర అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 15న టెండర్ తాలూకు టెక్నికల్ బిడ్లు తెరిచి ఏజెన్సీలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు.

## కిర్గిస్తాన్‌లో భారతీయ విద్యార్థులు సేఫ్

ఖైరతాబాద్: కిర్గిస్తాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న వైద్య విద్యార్థులు సురక్షితంగా ఉన్నారని ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ సంస్థ ఎండీ రామారావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ సంస్థ నుంచి వందలాది మంది విద్యార్థులు వైద్య విద్యనభ్యసించేందుకు కిర్గిస్తాన్‌కు వెళ్తారన్నారు. ఇటీవల ఈజిప్టు, పాకిస్తాన్‌కు చెందిన విద్యార్థుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలతో భారతీయ వైద్య విద్యార్థులపై ప్రభావం పడిందన్నారు. కొన్ని చానెళ్లు భారతీయ వైద్య విద్యార్థులపై దాడి అంటూ కథనాలు వేయడం వల్ల తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారన్నారు. భారత రాయబారి విశ్వవిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల బాగోగులు తెలుసుకున్నారన్నారు. ఈ సమావేశంలో ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రతినిధులు అజిజా అజిబేకోవా, సికోరా జకీరోవా తదితరులు పాల్గొన్నారు.




గురువారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ రామారావు

## పారిశుధ్య నిర్వహణ.. మరింత మెరుగ్గా

### నగర రోడ్లపై కొత్తగా 1500 రిక్షాలు, చిన్న ట్రాలీలు

### కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించిన బల్దియా

| జోన్ | అవసరమైన ట్రై సైకిళ్లు/ వీల్ బార్స్ |
|---|---|
| ఎల్బీనగర్ | 250 |
| చార్మినార్ | 300 |
| ఖైరతాబాద్ | 250 |
| శేరిలింగంపల్లి | 200 |
| కూకట్‌పల్లి | 250 |
| సికింద్రాబాద్ | 250 |

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగు పరిచేందుకు జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) సాయంతో జీహెచ్ఎంసీ సర్వే చేయించి.. 2640 చెత్త కుప్పలున్నట్లు తేల్చింది. వాటిని నివారించేందుకు వంద రోజుల ప్రణాళికలను అమలు చేస్తున్నది. ఇందులో భాగంగానే తాజాగా కొత్తగా ట్రై సైకిళ్లు (రిక్షాలు), వీల్ బార్స్ (చిన్న ట్రాలీ)లు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల కోడ్ ముగియడంతో మళ్లీ టెండర్లు పిలిచారు. ఒక్కో రిక్షాను గరిష్ఠంగా రూ. 24,600కు కొనుగోలు చేయాలని నిర్ణయించి.. ఈ మేరకు 1500 రిక్షాలు, మరో 1500 చిన్న ట్రాలీల కొనుగోలు టెండర్లు ఆహ్వానించారు. ఏ సంస్థ ఎంత ధరకు సరఫరా చేయగలదో చెప్పాలని, ఇందుకు టెండర్ గడువు వచ్చే నెల 14వ తేదీ వరకు విధించారు. నగరంలో చెత్త కుప్పలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

## ఇంకా ప్రాణాలతో చెలగాటమే!

### తనిఖీలు జరుగుతున్నా.. రోడ్డెక్కుతున్న ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు

### కొనసాగుతున్న డ్రైవ్.. మరో 27 బస్సులు సీజ్

### రెండ్రోజుల్లో రూ. 30 లక్షలు జరిమానా వసూలు

### క్షుణ్ణంగా తనిఖీలు చేస్తే.. భారీ ఆదాయం?

### పిల్లల ప్రాణాలకూ శ్రేయస్కరమంటున్న విద్యావేత్తలు

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : నిబంధనలు పాటించకుండా విద్యాసంస్థల యజమానులు రవాణా శాఖను బురిడీ కొట్టిస్తున్నారు. సరైన ఫిట్‌నెస్ లేని బస్సులను యథేచ్ఛగా రోడ్లపై నడుపుతున్నారు. ప్రమాదమని తెలిసినా.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. తక్కువ జీతంలో డ్రైవర్లను నియమించి.. బస్సులను నడిపిస్తున్నారు. అనుభవం లేని వారిని డ్రైవర్లుగా నియమించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డెక్కుతున్న విద్యా సంస్థల బస్సులపై ఆర్టీఏ అధికారులు నిఘా వేశారు. బృందాలుగా ఏర్పడి స్కూల్స్ జోన్స్‌లో తనిఖీలు చేపట్టారు. గ్రేటర్‌లో ఫిట్‌నెస్‌లేని 27 బస్సులను గుర్తించి సీజ్ చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలో అధికారులు రెండు రోజులుగా తనిఖీలు చేస్తున్నారని తెలిసినా.. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలించడం కొన్ని విద్యాసంస్థల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నది. కాగా, అధికారులు రెండ్రోజుల్లో రూ.30 లక్షల జరిమానా వసూలు చేశారు. వంద బస్సులను సీజ్ చేశారు. కాగా, 60% వరకు ఫిట్‌నెస్ లేని బస్సులు గ్రేటర్‌లో ఉన్నాయని ఓ అధికారి తెలిపారు. వాటన్నింటినీ తనిఖీ చేస్తే ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం సమకూరుతుందన్నారు.విద్యాసంస్థల బస్సుల విషయంలో అధికారులు పకడ్బందీగా తనిఖీలు చేస్తే అటు ప్రభుత్వానికి, ఇటు పిల్లల ప్రాణాలకు శ్రేయస్కరమని విద్యావేత్తలు చెబుతున్నారు.

## పలు చోట్ల వాన

### కుర్మగూడలో అత్యధికంగా 4.10 సెం.మీలు

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి మధ్య బంగాళాఖాతం వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిశాయి. గురువారం రాత్రి 9 గంటల వరకు సైదాబాద్ కుర్మగూడలో అత్యధికంగా 4.10, చార్మినార్ డబీర్‌పురలో 3.98, పాతబస్తీ సర్దార్ మహల్‌లో 3.35, అస్మాన్‌ఘడ్‌లో 3.28 , కాంచన్‌బాగ్‌లో 3.0, ఆజంపురలో 2.85, చాంద్రాయణగుట్టలో 2.38 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ వెల్లడించింది. ద్రోణి ప్రభావంతో రాగల మరో మూడు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 33.7, కనిష్ఠం 23.7 డిగ్రీలు, గాలిలో తేమ 83 శాతంగా నమోదైనట్లు తెలిపారు.



సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డులో జలమయమైన రహదారి



గురువారం సాలార్ జంగ్ మ్యూజియంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

## చట్టాన్ని అతిక్రమించొద్దు

### సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయం చేసుకుంటూ.. బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులకు అందరూ పూర్తి సహకారాన్ని అందించాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లు, బందోబస్తుకు సంబంధించిన వివిధ అంశాలుపై చర్చించడంలో భాగంగా గురువారం సాలార్ జంగ్ మ్యూజియంలో పోలీసులు, జీహెచ్ఎంసీ, జలమండలి తదితర శాఖలు, రాజకీయ పార్టీ నాయకులు, మతపెద్దలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలితో పాటు నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, కార్ హెడ్‌క్వార్టర్స్ అదనపు సీపీ సత్యానారాయణ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు.

చట్టాన్ని ఎవరూ కూడా తమ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. పటిష్టమైన బందోబస్తు ఉన్నదని, ప్రశాంతమైన వాతావరణంలో బక్రీద్‌ను నిర్వహించుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, విద్యుత్, వాటర్‌వర్క్స శాఖలు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని కోరారు.



## పర్యవేక్షణ తప్పనిసరి

### అంతరాయం లేని సేవలే ధ్యేయం

### వర్షాకాలంలో భద్రత చర్యలపై మెట్రో ఉన్నతాధికారుల సమీక్ష

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలం నేపథ్యంలో మెట్రో సేవలకు అంతరాయం లేకుండా సాగించేందుకు ముందస్తు కార్యాచరణలో భాగంగా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి నిర్వహించారు. గురువారం మెట్రో భవన్‌లో ఎల్ అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ కంపెనీ కియోలిస్, హెచ్ఎంఆర్ఎల్, ఇండిపెండెంట్ ఇంజినీరింగ్ సంస్థ అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో మెట్రో రైలు సేవలను నిరంతరాయంగా నడపడం, ప్రయాణికుల భద్రత, సౌలభ్యం వంటి అంశాలపై చర్చించారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మెట్రో రైలు కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని ఉన్నతాధికారులు అధికారులకు సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో రైలు సేవలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, అన్ని విస్తరణ జాయింట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అదేవిధంగా రెయిన్ వాటర్ స్పౌట్లను శుభ్రం చేయాలని, రెయిన్ వాటర్ గట్టర్ లీకేజీల నివారణ, మొక్కల తొలగింపు, ప్లాట్‌ఫారంపై వర్షం నీటిని తక్షణమే తొలగించేలా సిబ్బంది సర్దుబాట్లపై చర్చించారు. అదేవిధంగా ప్రకటనల బోర్డులు, ఫ్లెక్సీలను తొలగించాలని, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్ పనులు, స్టేషన్ రూఫ్ షీట్లు పడిపోకుండా చూడాలన్నారు. మెట్రో పాయింట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్ల వద్ద ముంపు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. రైలు ట్రాక్, సున్నితమైన ఉక్కు నిర్మాణాలపై పేరుకున్న తుప్పు తొలగించాలన్నారు. అదేవిధంగా మెట్రో ప్రయాణికులకు తక్షణమే సమాచారం చేరవేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన మెట్రో ప్రమాదాలపై కూడా చర్చించగా.. డోర్ల మధ్య ఇరుకుపోయిన ఘటనలపై ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైలు ఎక్కి, దిగేటప్పుడు, ఎస్కలేటర్‌పై ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని ప్రయాణికులకు సూచించారు. వర్షాకాలం భద్రత చర్యల్లో భాగంగా మెట్రో సేవలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు.